

క్రోమాలో ఆకర్షణీయమైన దసరా ఆఫర్లు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

టాటా ఎంటర్‌ప్రైజ్ క్రోమా దసరా సందర్భంగా ఆకర్షణమైన ఆఫర్లను అందిస్తున్నట్లు క్రోమా-ఇన్ఫినిటీ రిటైల్ లిమిటెడ్ – చీఫ్ ఆఫీసర్ శిబాశిష్ రాయ్ తెలిపారు. మంగళవారం విలేకరితో మాట్లాడుతూ క్రోమా స్టోర్స్, క్రోమా వెబ్‌సైట్ అంతటా గృహోపకరణాలు, టీవీలు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్‌లు, మరిన్ని విభాగాలలో డీల్‌లు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఆఫర్‌లు 25 అక్టోబర్ వరకు అందుబాటులో ఉంటాయన్నారు. క్రోమా నుండి కొనుగోలు చేసే కస్టమర్‌లు స్టోర్‌లలో లక్కీ డ్రా ద్వారా, కిక్ ఈవి ద్వారా ఎలక్ట్రిక్ బైక్‌లను గెలుచుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. క్రోమా రాష్ట్రవ్యాప్తంగా 13కు పైగా స్టోర్‌లు, క్రోమో నెట్వర్కులతో అందరికి అందుబాటులో ఉన్నాయన్నారు. 15శాతం వరకూ క్యాష్‌బ్యాక్, రూ. 20వేల వరకు ఎక్స్ఛేంజ్ ప్రయోజనాలు, 24 నెలల వరకు సులభమైన ఈఎంఐ సౌకర్యం ఉందన్నారు. వినియోగదారులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేట్రేగిపోతున్న 'అధికార' ఆగడాలు

పేదలపైకి 'జేసీబీ'లు..!

- ఈదులగుంటలో ఉద్రిక్తత
- పట్టించుకోని రెవెన్యూ

ప్రజాశక్తి–శ్రీకాళహస్తి/తొట్టంబేడు

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కొందరు అధికారపార్టీ నేతల ఆగడాలు అంతకంతకూ పేట్రేగిపోతున్నాయి..అధికారం అండగా ఎంతకైనా తెగించేస్తున్నారు..కడకు ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న పేదల ఇళ్లను సైతం కూల్చేందుకు వెనకాడటం లేదు..ఈ క్రమంలోనే అధికారపార్టీకి చెందిన ఓ నేత మంగళవారం ఈదులగుంట, అప్పలాయగుంట ప్రాంతంలో నివసిస్తున్న పేదల ఇళ్లను మందీమార్భలంతో వచ్చి ఖాళీ చేయించే ప్రయత్నం చేశాడు. దీంతో స్థానికులు తిరగబడటంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వివరాల్లోకి పోతే...శ్రీకాళహస్తి పట్టణానికి కూతవేటు దూరంలో ఈదులగుంట, అప్పలాయగుంట ప్రాంతాలు ఉన్నాయి. గతంలో ఈ రెండు ప్రాంతాలు చెరువు, వరవ కాలువలు, కాలువ పోరంబోకు భూములతో కూడుకుని ఉండేవి. అయితే కాలక్రమేణా చెరువులు ఆక్రమణ గురికావడం, అక్కడ పెద్దలు, పేదలు స్థిర నివాసాలు ఏర్పరుచుకోవడంతో కాలనీలుగా మారిపోయాయి. సుమారుగా 30 ఏళ్లుగా ఇక్కడ నివాసాలు ఏర్పరుచుకుంటుండంతో చెరువులు, కాలువలన్న బేధం లేకుండా కనుమరుగైన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలోనే ఈదులగుంట(తొట్టంబేడు మండల రెవెన్యూ), అప్పలాయగుంట(శ్రీకాళహస్తి రెవెన్యూ) పరిధిలో సుమారు 250

పేదలతో మాట్లాడుతున్న అంగేరి పుల్లయ్య

మంది పేదలు గత 30 యేళ్లుగా స్థిర నివాసాలు ఏర్పరుచుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి ప్రభుత్వము అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించింది. రేషన్, ఆధార్ కార్డులతో పాటు, కరెంట్ సర్వీసులు అందజేసింది. అయితే అప్పలాయగుంట ప్రాంతంలో తమ భూమి ఉందని చెప్పుకుంటున్న అధికారపార్టీకి చెందిన ఓ వ్యక్తి అక్కడ నుంచి పేదలను ఖాళీ చేయించాలని ఎన్నాళ్లగానో ప్రయత్నిస్తున్నాడు. ఆయనకు అధికారపార్టీతో పాటు రెవెన్యూ అండగా ఉందని సమాచారం. ఈ నేపథ్యంలోనే పలు దఫాలుగా అక్కడున్న పేదలను నయానో భయానే బెదిరించే ప్రయత్నం చేసినా బెడిసి కొడుతోంది. దీంతో మంగళవారం సుమారు 50 మంది అనుచరులతోటి రెండు జేసీబీలు తీసుకొచ్చి ఆ ప్రాంతంలో చదును చేసే ప్రయత్నం చేశాడు. దీంతో స్థానికులు తిరగబడి జేసీబీలను అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. టూటౌన్ పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితులను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. అయితే ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు కనీసం కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. పైగా సదరు వ్యక్తికి పరోక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

• పేదలకు హక్కు కల్పించాలి: సీపీఎం

ఈదులగుంట, అప్పలాయగుంట ప్రాంతాల్లో స్థిర నివాసాలు ఏర్పరుచుకుని జీవనం సాగిస్తున్న పేదలకు ప్రభుత్వం సర్వ హక్కులు కల్పించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈదులగుంట వివాదం నేపథ్యంలో మంగళవారం సాయంత్రం సంఘటనా స్థలానికి సీపీఎం నాయకులు వెళ్లారు. అక్కడ పేదలను పరామర్శించి మేమున్నామంటూ భరోసా ఇచ్చారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఏదేని భూమిలో 12 ఏళ్ల పాటు పేదలు స్థిర నివాసాలు ఏర్పరుచుకుంటే వారికి అన్ని హక్కులు కల్పించాలని సీపీఎం జిల్లాకార్యదర్శి వర్గ సభ్యుడు అంగేరి పుల్లయ్య అన్నారు. అలా కాకుండా పేదలను ఖాళీ చేయించే ప్రయత్నం చేయడం చట్ట విరుద్ధమన్నారు. స్థానిక ఎమ్మెల్యేతో పాటు జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి పేదలకు అన్ని హక్కులూ కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులతో పాటు జనసేన నాయకులు కొట్టే సాయి, మహేష్ కూడా పేదలకు అండగా నిలబడ్డారు. సీపీఎం నాయకులు గంధం మణి, పెనగడం గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

నగరంలో సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు ప్రబలకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని కమిషనర్ హరిత ఐఏఎస్ ఇంజినీరింగ్, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. నగరంలో సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు ప్రబలకుండా చేపడుతున్న చర్యలపై ఇంజినీరింగ్, ఆరోగ్య శాఖ, మలేరియా విభాగం అధికారులు, సిబ్బందితో మంగళవారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు నగరంలోని 50 వార్డుల్లో సిబ్బందికి ఫాగింగ్ యంత్రాలు ఇవ్వడం జరిగిందని అన్నారు. ప్రతి రోజూ ఆయా వార్డుల్లో ఫాగింగ్ చేయాలన్నారు. అలాగే నగరంలో ఎక్కడా డ్రైనేజీ కాలువలు చెత్త లేకుండా, మురుగునీరు నిలవకుండా శుభ్రం చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు, డెంగ్యూ , మలేరియా, చికెన్ గున్యా వంటి విష జ్వరాలు ప్రబలకుండా అన్ని చర్యలు చేపట్టామని, మరింత పటిష్టంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఒక ప్రణాళిక రూపొందించి అన్ని వార్డుల్లో మాలాతిన్, అబెట్, పైరేతిన్ వంటివి పాగింగ్, స్ప్రేయింగ్ చేయాలన్నారు. నీళ్ళు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయాలని, తద్వారా దోమల లార్వా పునరుత్పత్తి కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎక్కడైనా యంత్రాలు రిపేర్ అయితే వెంటనే మరమ్మతులు చేపించుకోవాలని అన్నారు. అన్ని వార్డుల్లో జరుగుతున్న పనులను ఆరోగ్య శాఖ , ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేసి రోగాల నివారణకు, పరిశుభ్రతకు అన్ని చర్యలు మరింత పటిష్టంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళిశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామి రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్ రెడ్డి, మలేరియా ఆఫీసర్ రూపకుమార్, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి - రామచంద్రాపురం సొరకాయలపాళ్యం పంచాయతీ కార్యదర్శి సుకుమార్ సమస్యలను పరిష్కరించకుండా గ్రామస్తులను బెదిరిస్తున్నాడని, అతనిని సస్పెండ్ చేయాలని గ్రామస్తులు సచివాయలం ఎదుట నిరసన తెలిపారు.మహిళలను అసభ్యకరంగా బెదిరిస్తున్నాడన్నారు. పూజావారిపల్లి, చల్లావారిపల్లి, సొరకాయలపాళ్యం గ్రామాల్లో వీధిదీపాలు, పరిసరాల పరిశుభ్రత, తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరితే పట్టించుకోవడం లేదని, సకాలంలో విధులకు హాజరుకావడం లేదని వాపోయారు. ఉపాధి పనులు కల్పించడం లేదన్నారు. పంచాయతీ నిధులను స్వాహా చేస్తున్నారని ఆరోపించారు. గతంలో పలుమార్లు ఎంపిడిఓ దృష్టికి తీసుకెళ్లినా, అతని పనితీరులో మార్పు రాలేదని, జిల్లా ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

చెంగారెడ్డిపల్లి ఎస్టీల స్థలం కబ్జా

ప్రజాశక్తి - రేణిగుంట

కరకంబాడి పంచాయతీకి చెందిన చెంగారెడ్డిపల్లి ఎస్టీలకు కేటాయించిన సర్వే నంబర్ 538/1, 538/2 లో 17 ఎకరాలు ప్రభుత్వ అనాదీన భూమిని ఎంఎల్ఎ అనుచరులమని చెప్పుకుంటూ రెండు నెలలుగా రేకుల షెడ్లు నిర్మిస్తూ అనధికారికంగా అమ్ముకుంటున్నారని సిపిఎం నాయకులు హరి మండిపడ్డారు. ఎస్టీల భూముల్లో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను సోమవారం అడ్డుకుని పనులను ఆపించి నిరసన దీక్ష చేపట్టారు. మంగళవారం వంటావార్పు కార్యక్రమాన్ని చేపట్టారు. ఎస్టీలకు న్యాయం జరిగేంత వరకూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు టెంట్ కింద కూర్చుని నిరసన తెలుపుతామన్నారు. సిపిఎం నాయకులు ఒ.వెంకటరమణ మాట్లాడుతూ అక్రమ కట్టడాలు కళ్లెదుటే కడుతున్నా తహశీల్దార్ ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. గిరిజనుల సమస్యను పరిష్కరించకపోతే కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షులు విజయబాబు, గిరిజన సంఘం కార్యదర్శి సంపూర్ణ మాట్లాడుతూ సర్వే నంబర్ 535లో 8.90 ఎకరాలు పోరంబోకు స్థలం ఉందని, సర్వే నెంబర్ 538/1, 538/2 లో 17 ఎకరాలు ప్రభుత్వ అనాదీన భూమి కబ్జాదారుల చేతిలో అన్యాక్రాంతం అవుతోందన్నారు. పై సర్వే నెంబర్‌లో చెంగారెడ్డిపల్లికి చెందిన 35 మందికి ఇంటి స్థలాలు, గిరిజన సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి కేటాయించారన్నారు. 2015లో హైకోర్టులో కేసు వేసిన ఆర్డర్ కాపీని కలెక్టర్‌కు, డిపార్టుమెంట్‌కు, హైకోర్టు న్యాయమూర్తికి పంపామన్నారు. తమ గ్రామానికి కలెక్టర్ వచ్చి, గిరిజన భూమిని కబ్జాదారుల నుంచి కాపాడి, ఎస్టీ ఎరుకుల కులస్తులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సత్యశ్రీ, శివానందం, సెల్వరాజు, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

న్యాయం చేయాలని సిపిఎం దీక్షలు

తమ స్థలాలకు శాశ్వత పరిష్కారం చూపాలంటూ సిపిఎం ఆధ్వర్యంలో ఎస్టీల వంటావార్పు

ఎస్వీ గోశాలలో రూ.46 కోట్లతో సెంటర్ ఫర్ ఎక్సలెన్స్

తిరుమల : దేశవాళీ గో జాతుల అభివద్ధికి, జన్యుపరమైన సామర్థ్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో తిరుపతిలోని ఎస్వీ గోసంరక్షణ శాలలో జాతీయ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు, టీటీడీ సంయుక్తంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేస్తోందని ఈవో ఎవి ధర్మారెడ్డి తెలిపారు. మంగళవారం తిరుమలలో తన కార్యాలయంలో ఈవో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ మత్స్య, పశు సంవర్ధక శాఖలు గోవుల జన్యు పరిరక్షణ కోసం రూ.46 కోట్లు నిధులు మంజూరు చేశారన్నారు. ప్రతి రోజూ తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి అన్ని సేవలకు 60-100 కిలోల నెయ్యి, మూడు వేల లీటర్లు పాలు దేశవాళీ గో జాతుల నుండి ఉత్పత్తి చేయడానికి దేశావళి గోవులను అభివద్ధి చేయడమే లక్ష్యంగా టీటీడీ పనిచేస్తున్నట్లు తెలిపారు. ఎన్‌డీబీ, ఎన్‌డీఎస్‌లు సమన్వయం చేసుకుని ప్రాజెక్టులోని అన్ని భాగాలు విడుదల అయిన నిధుల ద్వారా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో శ్రీజా మహిళా మిల్క్ ప్రొడ్యుసర్ ఛైర్‌పర్సన్ శ్రీదేవి, ఎన్‌డిడిబి ఎండి డా. దేవానంద్, జేఈవో సదా భార్గవి, ఎఫ్ఎ అండ్ సిఏవో బాలాజి, సిఇ నాగేశ్వర్ రావు, గో శాల డైరెక్టర్ హరనాథ రెడ్డి, ఎస్వీ పశు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు డా.సర్జన్‌రావు, డా. వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో ఈవో సమీక్ష

కులగణన చేయాలని వినతి

తిరుపతి టౌన్ :రాష్ట్రంలో కులగణన చేయాలని సమాజ్‌వాదిపార్టీ రాష్ట్ర నాయకురాలు వేలూరు తేజవతి కలెక్టర్‌కార్యాలయంలో ఉన్నతాధికారులకు వినతిపత్రం ఇచ్చారు. కులగణనం చేయడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. వెనుకబడిన వారికి సంబంధించిన సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయవచ్చని సూచించారు. విద్య, ఉద్యోగంలో తగిన ప్రాధాన్యత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస యాదవ్ పాల్గొన్నారు.

సింహ వాహనంపై మలయప్ప

ప్రజాశక్తి -తిరుమల

శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజైన మంగళవారం ఉదయం శ్రీమలయప్పస్వామివారు యోగనరసింహస్వామి అలంకారంలో సింహ వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. వాహనం ముందు గజరాజులు ఠీవిగా నడుస్తుండగా, భక్తజన బందాలు భజనలు, కోలాటాలు, జియ్యంగార్ల ఘోష్టితో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. రాత్రి ముత్యపు పందిరి వాహనంపై దర్శనమిచ్చారు. ఈ వాహన సేవలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఎవి.ధర్మారెడ్డి, జెఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్వో నరసింహకిషోర్ తదితరులు పాల్గొన్నారు. సింహ వాహన సేవలో మొత్తం 11 కళాబందాలు, 284 మంది కళాకారులు పాల్గొని తమ సంగీత, నత్య, కళా ప్రదర్శనలతో భక్తులకు మరింత ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించారు. తమిళనాడు రాష్ట్రం కల్చరల్ ఇన్‌చార్జ్ పూర్ణ పుష్కల మాట్లాడుతూ శ్రీవారి అనుగ్రహంతో మాడ వీధుల్లో ప్రదర్శనలివ్వడం తమ అదృష్టమని సంతోషం వ్యక్తం చేశారు. చెన్నై, సెలం, తిరుచ్చి, శ్రీరంగం, ఎరోడ్ నుండి 6 కళాబందాలు, 150 మంది కళాకారులు ఈ రోజు ప్రదర్శనలో పాల్లొన్నట్లు చెప్పారు. ఇందులో 10 నుండి 30 సంవత్సరాల మధ్య వమస్సు గల విద్యార్థులు, ఉపాధ్యాములు, ఇంజినీర్లు, డాక్టర్లు, లాయర్లు ఉన్నట్లు తెలిపారు. టీటీడీ అధికారులు చక్కటి బస, భోజన ఏర్పాట్లు చేశారని, ప్రతి కళా బందం వద్దకు వచ్చి కళాకారుల వస్త్రాధారణ, నత్యం, అభినయంను పరిశీలించిట్లు వివరించారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజగోపాల్, దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు పాల్గొన్నారు.

కోలాటాల సందడి

కార్పొరేట్ క్షౌర కంపెనీలు వద్దు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

నాయి బ్రాహ్మణుల కుల వత్తికి పోటీ పడుతున్న కార్పొరేట్ సంస్థలను నగరంలో రానివ్వకుండా చూసుకోవాలని తిరుపతి నగర నాయి బ్రాహ్మణ సేవా సంఘం కమిటీ ఏకగ్రీవ తీర్మానం చేసింది. కమిటీ ఛైర్మన్ పుల్లయ్య ఆధ్వర్యంలో మంగళవారం కృష్ణాపురం ఠానా వద్ద నూతన కార్యాలయాన్ని ప్రారంభించుకున్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పుల్లయ్య మాట్లాడుతూ నాయిబ్రాహ్మణ కులవృత్తికి పేటెంట్ హక్కు తీసుకొచ్చే ప్రయత్నం చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఆవులపాటి బుజ్జిబాబు మాట్లాడుతూ నూతన కమ్యూనిటీ హాలు నిర్మాణం ప్రతిపాదనను అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా కృషి చేస్తామన్నారు. సేవా సంఘం నగర అధ్యక్షుడు సిబ్యాల సుధాకర్, గౌరవ అధ్యక్షుడు వరికుంట్ల నారాయణ, గౌరవ సలహాదారుడు కే. రామనారాయణ, రూరల్ అధ్యక్షుడు అవిలాల మునికష్ణ, కమిటీ సభ్యులు మదన్, భారత యాదవ మహాసభ జాతీయ ఉపాధ్యక్షుడు అన్న రామచంద్ర యాదవ్, బిసి నాయకులు సాకం ప్రభాకర్ పాల్గొన్నారు.

నాయిబ్రాహ్మణ సేవాసంఘం కార్యాలయం ప్రారంభం

ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాల వ్యాధులు నయం

డాక్టర్ రేణుదీక్షిత్

ప్రజాశక్తి - తిరుమల

వైద్యవిధానమైన ఆయుర్వేదానికి టీటీడీ ఊతమిస్తోందని, పంచకర్మ ద్వారా దీర్ఘకాల రోగాలను శాశ్వతంగా నయం చేయవచ్చని, శ్రీవారి భక్తులకు మరింత మెరుగైన ఆయుర్వేద వైద్యం అందిస్తున్నామని ఎస్వీ ఆయుర్వేద ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రేణుదీక్షిత్ తెలిపారు. తిరుమలలోని రాంభగీచా-2లో గల మీడియా సెంటర్‌లో మంగళవారం ఎస్వీ ఆయుర్వేద ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రేణుదీక్షిత్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రేణుదీక్షిత్ మాట్లాడుతూ శ్రీవారి బ్రహ్మోత్సవాలలో టీటీడీ అందిస్తున్న ఆయుర్వేద వైద్యానికి భక్తుల నుండి విశేష స్పందన వస్తోందని తెలిపారు. కల్యాణ వేదిక చెంత ఏర్పాటు చేసిన ఆయుర్వేద ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంటుందన్నారు. ఇందులో ఔషధగుణాలున్న మొక్కలను, వాటిని ఏవిధంగా ఉపయోగించాలి, ఏ వ్యాధికి ఉపయోగించాలనే విషయాలను సవివరంగా వివరిస్తూ ప్రదర్శన ఏర్పాటు చేశామని వివరించారు.

అదే విధంగా బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తుల సౌకర్యార్థం శ్రీ వరహస్వామి అతిథి భవనం పక్కన ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం, సిఆర్‌వో, లేపాక్షి దగ్గర ఉన్న ప్రథమ చికిత్స కేంద్రాలలో ప్రతిరోజూ దాదాపు 1000 మంది భక్తులకు వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. ఎస్వీ ఆయుర్వేద ఫార్మసిలో మొత్తం 314 రకాల ఫార్ములాలకు ఆయుష్ శాఖ నుండి అనుమతి లభించిందని, వీటిలో 60 రకాల మందులు మొదటి దశలో ఉత్పత్తి చేసి రోగులకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. షుగరు, బిపి లాంటి దీర్ఘకాల రోగాలకు సంబంధించి ఆయుర్వేద మందుల ద్వారా నయం చేయడానికి ప్రత్యేక చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. కోవిడ్ అనంతర పరిణామాల నేపథ్యంలో ఆయుర్వేద వైద్యానికి ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ లభిస్తోందన్నారు. అదేవిధంగా పంచకర్మ చికిత్స విధానం ద్వారా 5 రకాల మలినాలను శరీరం నుండి తొలగించేలా వైద్యసేవలు అందిస్తున్నామన్నామని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఆర్వో పి.నీలిమ పాల్గొన్నారు.

సమగ్ర ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలి

తిరుపతి టౌన్ : సమగ్ర ఓటర్ల జాబితా తయారు చేసేందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని తిరుపతి నియోజక ఓటర్ నమోదు అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులు తదితర అంశాలపై మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల అధికారులతో కమిషనర్ సమావేశమై సమీక్షించారు. ఇప్పటికే ఇంటింటి సర్వే పూర్తి చేశామని అన్నారు. ఓటర్ల జాబితా తయారీలో ఎటువంటి ఇబ్బందులూ లేకుండా రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళిశ్వర్ రెడ్డి, ఈ. డి.టి. జీవన్ పాల్గొన్నారు.

'వాసు కార్డియాక్ కేర్'లో..

'గుండె' పదిలం



డా॥ వాసుదేవ శెట్టి

ఆస్పత్రి ప్రత్యేకతలు

- సంపూర్ణ గుండె చికిత్స, ఈసిజి
- ఎకో అండ్ కలర్ చిన్నపిల్లల గుండె స్కానింగ్.
- ట్రెప్ట్ టి అండర్1 వెంటిలేటర్ సదుపాయం
- 24 గంటలు ఇంటెన్సివ్ కేర్ సదుపాయం.

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

పేద రోగులకు పెన్నిధిగా ఆత్మస్థైర్యంతో అతి తక్కువ ఫీజులతో అత్యాధునిక వైద్యాన్ని అందిస్తున్నామని కార్డియాక్ కేర్ ఆస్పత్రి అధినేత డాక్టర్ వాసుదేవశెట్టి అన్నారు. ప్రజల గుండె చప్పుడు తమ సొంతమని చెప్పారు. ఇటీవల కాలంలో చిన్న వయస్సులోనే 'హార్ట్‌స్ట్రోక్'కు గురవుతుండడంతో తమ ఆస్పత్రి ప్రత్యేకలతో పాటు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయన మాటల్లోనే..

లీలామహల్ సర్కిల్ వద్ద మా ఆస్పత్రి ఉంది. డాక్టర్‌గా 21 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం, 12 సంవత్సరాలు గుండె శస్త్ర చికిత్సలలో నైపుణ్యం ఉంది. నేను నిర్వహించిన ఎంజియోగ్రామ్‌లలో ఎవ్వరికీ ఎలాంటి ప్రాణాపాయం కలగలేదు. స్టంట్లు వేయడంలో పూర్తి గ్యారంటీ (99శాతం) మా ప్రత్యేకత. లెఫ్ట్ మెయిన్ అండ్ కాంప్లెక్స్ కొరోనరి ఇంటర్వెన్షన్‌పై దక్షిణ కొరియా, సియోల్‌లో ప్రత్యేమైన శిక్షణ గడించాను. గుండెలోని రంధ్రాలు (ఎఎస్‌డి, విఎస్‌డి, పిడిఎ) మూసివేత చికిత్సలు, పేస్‌మేకర్ థెరపీలలో సుదీర్ఘ అనుభవం ఉంది. స్విమ్స్ డిఎం కార్డియాలజీ ప్రవేశపరీక్షలో స్టేట్ ప్రథమ ర్యాంకు సాధించి, జనరల్ మెడిసిన్‌లో గోల్డ్ మెడల్ పొందాను. తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో అత్యుత్తమ వైద్య ప్రమాణాలతో వాసు కార్డియాక్ కేర్‌ను స్థాపించాం. గుండెపోటును ముందస్తు జాగ్రత్తలతో నివారించవచ్చు. గుండె శరీరంలోనే కణాలు అన్నింటికీ రక్తాన్ని పంపింగ్ చేస్తుంది. అన్నింటికి రక్తం ద్వారా ఆక్సిజన్ ఇతర పోషకాలు సరఫరా అవుతోంది. గుండె కండరాలకు రక్తం సరఫరా ఆగిపోవడాన్ని గుండె పోటు (హార్ట్ ఎటాక్) అంటారు. గుండెకు సంబంధించి సంపూర్ణ పరీక్షలు చేయించిన తర్వాత డాక్టర్ సలహా మేరకు నడుచుకుంటే ఏ సమస్య ఉండదు.

గుండెపోటు లక్షణాలు

ఛాతి మధ్యలో అసౌకర్యంగా ఒత్తిడి బరువు ఉన్నట్లు, మెలి పెట్టినట్లు నొప్పి ఉండవచ్చు. ఇలా కొన్ని నిమిషాల పాటే ఉంటుంది. ఛాతినొప్పి, వీపు నొప్పి, కడుపు పై భాగంలో నొప్పి, లోపలివైపు నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, మెదడు నొప్పి, తల తిరగడంతో పాటు చెమటలు పట్టడం లాంటి లక్షణాలు ఉంటే గుండెపోటుకు దారితీస్తుంది. ఈ లక్షణాలు ఉన్న వ్యక్తి వెంటనే దగ్గరలో ఉన్న హద్రోగ నిపుణులను సంప్రదించి చికిత్స పొందాలి. తప్పకుండా మందులు వాడడం, రక్తంలో కొలెస్ట్రాల్ శాతం తగ్గించుకోవడం, వ్యాయామం చేయడం మొదలైనవి పాటించాలి. గుండెపోటు విషయంలో అలక్ష్యం, ఆలస్యం చేయరాదు. గుండెపోటు లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలో గుండెజబ్బుల డాక్టర్ను సంప్రదించి, తగిన వైద్యం చేయించాలి. గుండెకు సంబంధించి అన్ని రకాల వైద్యం మా ఆసుపత్రిలో అత్యాధునిక సౌకర్యాలతో చేస్తున్నాం. అత్యాధునిక సాంకేతిక వైద్య పరికరాలతో, గుండె జబ్బులకు వైద్యం అందిస్తున్నాం. గ్రామాల్లో సైతం ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నాం. పూర్తి వివరాలకు 0877 2272666 సంప్రదించాలని కోరారు.

రైతులకు అందుబాటులో నాణ్యమైన ఎరువులు

ఎరువుల దుకాణాలు తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: రైతులకు అందుబాటులో నాణ్యమైన ఎరువులు ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు పేర్కొన్నారు. మండలంలోని కమలయ్యగారిపల్లి పంచాయతీ మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రాలను జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ ప్రసాద్ రావు, ఏడిఏ ధనుంజయరెడ్డి మంగళ వారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రైతు భరోసా కేంద్రాల్లో రికార్డులను ఎరువుల స్టాకును పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్థానికంగా ఉన్న రైతు భరోసా కేంద్రాలలో నాణ్యమైన ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రైతులకు పండిస్తున్న పంటల పరిస్థితిని అడిగి తెలుసుకుని సాగుకి సూచనల సలహాలు ఇచ్చారు. ఆర్‌బికెలలో యూరియా, డిఏపి సర్ఫిల్ ధరలకే లభిస్తుందని వాటిని రైతులు ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఖాదర్ బాషా, సిబ్బంది మునిశేఖర్, సాయి కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

సకాలంలో జీతాలు ఇవ్వాలి: పిఆర్‌టియు

ప్రజాశక్తి - బాలాయపల్లి : ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు ఇవ్వాలని పిఆర్‌టియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వేర్ల బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. ఉపాధ్యాయుల జీతాలపై పిఆర్‌టియు మండల కార్యవర్గం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు చెల్లించాలన్నారు. 2023 లో డీఎస్సీ లో ఎంపికైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. పెండింగ్ లో ఉన్న డిఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. సరెండర్ లీవులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, ఏపీజీఎల్ఐ, పీఎఫ్ లోనులు కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఖాతాల్లోకే జమ చేయాలన్నారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీనివాసులు నాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎం వ్యాఖ్యలు సరికాదు: టిడిపి

నిరసన తెలుపుతున్న టిడిపి మహిళా విభాగం నాయకులు

ప్రజాశక్తి -గూడూరు: చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి పై రాష్ట్ర డిప్యూటీ సీఎం నారాయణస్వామి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తిరుపతి పార్లమెంటు టిడిపి మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి శ్రావణి రెడ్డి పేర్కొన్నారు. తిరుపతి జిల్లా గూడూరు పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ మహిళా విభాగం అధ్యర్యంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. గూడూరు పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో టిడిపి మహిళా విభాగం నాయకులు రాష్ట్ర డిప్యూటీ సీఎం నారాయణస్వామి చేసిన వ్యాఖ్యలను ముక్తకంఠంతో ఖండించారు. ఈ సందర్భంగా శ్రావణి రెడ్డి మాట్లాడుతూ రాజమండ్రి సెంట్రల్ జైల్లో సరైన వసతులు లేక స్కిన్ ఎలర్జీతో బాధపడుతున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని భువనేశ్వరి దేవి బాధను వ్యక్తం చేయగా నారాయణస్వామి భువనేశ్వరిని కించపరుస్తూ మాట్లాడటం సమంజసం కాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీలావతి , భారతి పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర ఆలయానికి కిరీటాలు వితరణ

ప్రజాశక్తి - చిట్టమూరు: మండలం లోని మల్లం గ్రామంలోని శ్రీవల్లి దేవసేన సమేత స్వయంభూ శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయా నికి చెన్నై కు చెందిన రమణ రైస్ ట్రేడర్స్ యజమాని జయకృష్ణ, షాలిని దంపతులు రెండు కిలోల బరువు గల లక్ష70వేల రూపా యలు విలువ కలిగిన వెండి కిరీటాలను ఆలయ కమిటీ చైర్మన్ చిల్లకూరు సాయికిషోర్ రెడ్డి అధ్వర్యంలో స్వామికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు భాను ప్రకాష్ శర్మ పాల్గొన్నారు.

ఆలయానికి వెండి కిరీటం బహూకరిస్తున్న దాతలు

20న సామూహిక అక్షరాభ్యాసం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20వ తేదీ వేద పండితుల ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలోని శ్రీ సరస్వతి మందిరంలో సామూహిక అక్షరాభ్యాస నిర్వహిస్తున్నామని పాఠశాల కమిటీ సభ్యులు అరవింద మంగళవారం విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సామూహిక అక్షరాభ్యాసం ఆనవాయితీగా నిర్వహిస్తున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామ్మోహన్ రావు, సనత్ రెడ్డి పాల్గొన్నారు.

సంపూర్ణమ్మకు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలం కారూరు లో సిపిఎం మండల కార్యదర్శి రామచంద్రా రెడ్డి, వైసిపి నాయకులు మణి రెడ్డిల మాతృమూర్తి జై సంపూర్ణమ్మ భౌతిక కాయానికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మంగళవారం మధ్యాహ్నం నివాళులు అర్పించారు. అనంతరం మృతురాలి కుమారులు మణి రెడ్డి, రామచంద్రా రెడ్డిని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి జనార్దన్, రమేష్, నాగరాజు, వైసిపి అధ్యక్షుల కే చలపతి రాజు, ఎంపిటిసి రమేష్ రాజు, తప్పయ్య, మోహన్, బాబు రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా దసరా శరన్నవరాత్రోత్సవాలు

ప్రజాశక్తి -ఏర్పేడు: ఏర్పేడు మండలం చిందేపల్లిలో వెలసిన పార్వతి సమేత సిద్దేశ్వర స్వామి దేవాలయంలో దసరా శరన్నవరాత్రోత్సవాలు మూడు రోజుల నుంచి వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ ధర్మకర్త గంగాపులేటి గిరిధర్ రెడ్డి అధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి దినం వివిధ ప్రాంతాల భజన బృందం ముక్కుమ్మడి దీనా కలిసి వచ్చి వారి భజనలతో కోలాహలంగా ఆటపాటలతో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆలయ వేద పండితులు సాయి శర్మ స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రెజరర్ గంగాపులేటి పార్థసారధి రెడ్డి, మహానంద రెడ్డి, మోహన్ రెడ్డి, సుబ్బారామి రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు అండగా నిలుద్దాం: టిడిపి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అక్రమ కేసులో అరెస్టై, రిమాండ్ ఖైదీగా జైలు జీవితం గడుపుతున్న టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుకు ప్రజల మద్దతు కావాలని ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషిత రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని నాలుగో వార్డ్ లో మంగళవారం బాబుకోసం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. చంద్రబాబు అరెస్టు అయిన తీరును ప్రజలకు వివరించారు. రాజకీయ కక్ష్యతోనే బాబు అరెస్టు జరిగిందనీ, త్వరలోనే ఆయన నిర్దోషిగా బయటకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. విజయ్ కుమార్ నాయుడు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం: విసి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం అభివృద్ధి పథంలో సాగుతోందని విసి ఆచార్య డి. భారతి అన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం లో పరిపాలన భవనానికి ఆనుకొని పొడిగింపు నూతన భవన నిర్మాణ పనులను వర్సిటీ ఉపకులపతి ఆచార్య డి. భారతి మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా వర్సిటీ రాష్ట్రంలో అన్ని వర్సిటీలతో పోలిస్తే అభివృద్ధి పథంలో ముందుకు నడుస్తోందన్నారు. ఒక ప్రణాళికాబద్ధంగా తరగతులను నిర్వహించడం, పరీక్షలు నిర్వహించడం, ఫలితాలను వెంటనే వెల్లడిస్తున్నామన్నారు. బోధన, పరిశోధనా రంగంలో కూడా వివిధ విదేశీ విశ్వవిద్యాలయాలతోనూ, పరిశ్రమలతోనూ, సంస్థలతోనూ సహకార అవగాహన ఒప్పందాలను కుదుర్చుకోవడంలో వర్సిటీ అధ్యాపకుల బృందం కృషి ఎనలేనిదన్నారు. పరిపాలన భవనానికి అనుబంధంగా ఉన్న నూతన భవనంలో అంతర్జాతీయ విద్యార్థిని సంబంధాల కార్యాలయాన్ని కార్యాలయానికి కేటాయించడం ద్వారా అంతర్జాతీయ సంస్థలతో సహాయ, సహకార, ఒప్పందాల, అవగాహన, ఒడంబడికలను చేసుకోవడానికి సులభతరంగా ఉంటుందన్నారు. మహిళా వర్సిటీలో విద్యార్థినులకు ఉన్నతమైన అవకాశాలను అందించే దిశగా క్యాంపస్ ప్లేస్మెంట్లను ప్రతి విభాగం తరఫున ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ నూతన భవనంలో అంతర్జాతీయ సంబంధాలు, పరీక్షల విభాగం, సెంట్రల్ నెట్వర్కింగ్ ఫెసిలిటీ కి కేటాయించబడి మూడు ఫ్లోర్లలో పరిపాలన కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజిని అంతర్జాతీయ విద్యార్థిని సంబంధాల డీన్ ఆచార్య విజయలక్ష్మి, అధ్యాపకుల సంఘం కార్యదర్శి ఆచార్య త్రిపుర సుందరి, ఉమా మహేశ్వరి దేవి, నీలిమ, శ్రీరజిని, పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

భవననిర్మాణ పనులను పరిశీలిస్తున్న శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విసి డి భారతి

వాలంటీరుకు ఎమ్మెల్యే సాయం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రోడ్డు ప్రమాదంలో గాయపడి వైద్యం కోసం అవస్థలు పడుతున్న ఓ వాలంటీరును స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి మానవత్వంతో ఆదుకున్నారు. 14వ వార్డు చెందిన వాలంటీరు కిరణ్ ఇటీవల చిత్తూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయపడ్డాడు. వేలూరు సీఎంసి హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కిరణ్ వైద్యం నిమిత్తం ఆయన తండ్రికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం రూ. లక్ష ఆర్థిక సాయం అందజేశారు. కిరణ్ పూర్తిగా కోరుకునే వరకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. పగడాల రాజు, సత్య జెట్టి, శీను జెట్టి, నాగరాజు జెట్టి, కుమార్ జెట్టి, మురళి జెట్టి, చెక్రి జెట్టి, సెన్సీర్ కుప్పం శేఖర్, చింతామణి పాండు, శివకుమార్ యాదవ్, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

వాలంటీరు తండ్రికి ఆర్థిక సాయం అందిస్తున్న వైసిపి నాయకులు

రూ.5 లక్షల బీమా చెక్కు పంపిణీ

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలం పులింగుంట లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రమేష్ భార్య లతకు వైఎస్ఆర్ బీమా కింద రూ.5 లక్షలు చెక్కును ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మంగళ వారం అందించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ అండగా ఉంటుం దని, పలువురు ప్రమాదాలకు గురై మరణిస్తు న్నారని, కొందరు వికలాంగులు అవుతు న్నారని ప్రభుత్వ బీమా పథకాన్ని నియోజక వర్గంలో అధికారులు తన వంతుగా అర్హులైన ప్రతి ఒక్కరిని వర్తించేందుకు చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు మధుసూదన్ రావు, ఎంపీడీవో శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ నాయుడు, సర్పంచ్ శ్యామల, ఎంపీటీసీ రమేష్ రాజు, తప్పయ్య, మోహన్, బాబు రెడ్డి, పాల పద్మనాభం పాల్గొన్నారు.

బీమాచెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

అమ్మకానికి యూనివర్శిటీ పోస్టులు

తెలుగు నాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి డా ఉమేష్ రావు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పరిశోధనా రంగంలో విశేష ప్రావీణ్యం సంపాదించి, తాము తెలుసుకున్న విజ్ఞానాన్ని ప్రపంచానికి తెలియజేయాలన్న ఆశయ సాధన కోసం విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకులుగా పనిచేయాలనుకుంటున్న ఎంతో మంది ఔత్సాహికులకు ఆశాభంగం కలిగేలా యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను అమ్మకానికి పెట్టినట్లు అనుమానం కలుగుతోందని తెలుగు నాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి డా.ఉమేష్ రావు ఆరోపించారు. రాష్ట్రంలో గల అన్ని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న దాదాపు మూడు వేల పైచిలుకు సహాయ ఆచార్య, సహ ఆచార్య, ఆచార్యుల నియామకాలను చేపట్టకుండా గత నాలుగు సంవత్సరా లుగా కాలయాపన చేసిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎప్పటికప్పుడు నోటిఫికేషన్ తేదీలను వాయిదా వేస్తూ ఔత్సాహిక నిరుద్యోగుల ఆశలపై నీళ్ల చల్లిందని మండి పడ్డారు. డిగ్రీ కళాశాల లోని ఒప్పంద లెక్చరర్లను క్రమబద్దీకరిం చినట్లుగానే, గత కొన్ని సంవత్సరాలుగా యూనివర్శిటీలలో ఒప్పంద ప్రాతిపదికన అధ్యాపకులుగా పనిచేస్తూ, చాలీచాలని జీతాలతో జీవితాలను సాగదీస్తున్న వారిని కూడా క్రమబద్దీకరించాలని ఉమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

'గడపగడపకు మనప్రభుత్వం'కు అపూర్వ స్పందన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: గడపకు గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి మంగళవారం పట్టణంలోని 13వ వార్డు(ఎంజి స్ట్రీట్, సర్దార్ స్ట్రీట్, దోబీ ఘాట్, సత్యసాయి స్ట్రీట్) లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎమ్మెల్యేకు బ్రహ్మరథం పట్టారు. తమ సమస్యలను అర్జీల రూపంలో తెలిపారు. సమస్యల సత్వర పరిష్కారం కోసమే సీఎం జగన్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహి స్తున్నట్లు చెప్పారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా? తెలుసుకోవాలని ఎమ్మెల్యే లను గడప గడపకు పంపుతున్న ఏకైక సీఎం జగన్ అని కొనియాడారు. వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ పాలన సాగిస్తోందనీ, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని మళ్ళీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనార్దన్ రావు పవర్, దేవస్థానం చైర్మన్ అంజురు తారక శ్రీనివా సులు, పట్టణ అధ్యక్షు డు పగడాల రాజు, ముత్యాల పార్ధసారథి,అట్ల రమేష్, పుష్ప, బ్రహ్మయ్య, రాజేష్, కార్తీక్, కహీల్, శేఖర్, భూపతి, సమీర్, శివ, బాల, కంటా ఉదయ్ కుమార్, చింతామణి పాండు,సురేష్, పటాన్ ఫరిద్, కిరణ్ పాల్గొన్నారు.

వెంకటగిరిలో ఇన్వెస్ట్ ఇండియా టీం ప్రతినిధి విస్తృత పర్యటన

ఓడీఓపీ అవార్డు 2023 పోటీలో వెంకటగిరి చేనేతలు

ప్రజాశక్తి-వెంకటగిరి: ఒన్ ఇండియా ఒన్ ప్రోడక్ట్ (ఓడీఓపీ) అవార్డు 2023 ప్రతిష్టాత్మకంగా జరిగే పోటీలో వెంకటగిరి చేనేత ఉత్పత్తులకు కేంద్ర ప్రభుత్వ సహాయంతో జాతీయ, అంతర్జాతీయ మార్కెటింగ్ సౌకర్యం కల్పించడానికి తోడ్పడుతుందని అందుకే నేడు పరిశీలిస్తున్నామని ఇన్వెస్ట్ ఇండియా టీం కమిటీ ప్రతినిధి బృందం ప్రతినిధి జగీష్ తివారి మిశ్రా తెలిపారు. మంగళవారం ఉదయం నుండి సాయంత్రం వరకు వెంకటగిరి చేనేత వస్త్రాలు పోటీపడుతున్న నేపథ్యంలో వెంకటగిరిలో ఇన్వెస్ట్ ఇండియా టీం కమిటీ ప్రతినిధితో కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి, అధికారులు విస్తృతంగా పర్యటించి వెంకటగిరి చేనేతపై నేత నుండి విక్రయం, చరిత్ర, సంస్కృతి వంటివి నేతన్నలతో , నిష్ణాతులతో మమేకమై స్వయంగా పరిశీలించారు. ఇన్వెస్ట్ ఇండియా టీం కమిటీ ప్రతినిధి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశంలోని 751 జిల్లాల నుంచి 1,102 రకాల స్థానిక ప్రత్యేక నైపుణ్యాన్ని ప్రతిబింబించే హస్తకళా ఉత్పత్తుల తరపున ఆయా జిల్లాల, రాష్ట్రాల అధికారుల నుంచి అందిన ప్రతిపాదనల మేరకు నేడు తిరుపతి జిల్లాకు చెందిన వెంకటగిరి చేనేత వస్త్ర నైపుణ్య ఉత్పాదనలు పరిశీలించామని, కేంద్రానికి నివేదిక అందించనున్నామని వివరించారు. ప్రతి విషయంలో అడుగు అడుగునా అభిమానించిన నేతన్నలకు ధన్యవాదాలు తెలిపారు. కలెక్టర్ వెంకటరమణా రెడ్డి మాట్లాడుతూ ఘన చరిత్ర కలిగిన వెంకటగిరి చేనేత వస్త్రాల నైపుణ్యానికి ఓడీఓపీ 2023 అవార్డు లభించి సంబంధిత మార్కెటింగ్ మరింతగా విస్తరించడమే కాక జిల్లా ప్రతిష్ఠ కూడా మరింత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి కమిటీ ప్రతినిధికి స్వాగతం పలికారు. అనంతరం వెంకటగిరిలో బంగారు పేటలో నేతన్న నాగరాజు నూలు వడికే ఆశును చూపిస్తూ ఆశు ప్రక్రియ అనంతరం గంజికి పంపే విధానం వివరించారు. నేతన్న కూనా మల్లికార్జున పట్టు , కాటన్ వంటివి వస్త్రాలు దోనికి చుట్టే విధానం వివరించారు. టాటా ట్రస్ట్ అంతరాన్ అందిస్తున్న సహకారం , నేతన్నలను వారి వృత్తిలో నైపుణ్యత కల్పించడం,మగ్గం పై నేత నేయడం, వస్త్రం పై దేవుళ్ళ బొమ్మల అల్లకం వంటివి ఉచిత శిక్షణ ఇస్తున్న వంటివి వివరించారు. స్థానిక నేతన్నలు వృత్తిలో కలిగే సంతోషాన్ని , తమ అనుభవాలను వివరించారు. భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ, చేనేత అభివృద్ధి కమిషనర్ కార్యాలయం సహకారం తో కేంద్ర ప్రభుత్వ అవార్డు గ్రహీత వేయి మందికి పైగా శిక్షణ ఇచ్చిన మగ్గాలు, నేసిన రకాల చీరలు, తనకు అందిన అవార్డులు , కేంద్ర ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో అందించిన ఎలక్ట్రానిక్ నేత మిషన్ (పవర్ లూం కాదు)వంటివి వివరించారు. అలాగే మరో అవార్డు గ్రహీత అయిన జి.రమణయ్య జామ్దాని ట్రెడిషన్ రంగంలోచీరలపై నేసిన బొమ్మల వస్త్రాలను , నేసే విధానం, రాజుల కాలంలో వీటి ప్రత్యేకత వివరించారు. రాజ రాజేశ్వరి చేనేత సహకార సంఘం పరిశీలించి సంఘం ద్వారా ముడి సరుకులు ఇవ్వడం, నేతన్నలకు ఉపాధి కల్పించడం, నేసిన వాటికి ప్రముఖ కంపెనీలతో మాట్లాడి మార్కెటింగ్ కల్పించడం వంటివి సంఘం ప్రతినిధి సుమంత్ వివరించారు. అనంతరం ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హాండ్ లూమ్ టెక్నాలజీ కళాశాల పరిశీలించి అక్కడ అందుతున్న శిక్షణ, వుద్యోగ అవకాశాలు ప్రిన్సిపల్ గిరిధర్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి సంతృప్తి వ్యక్తం చేసారు. ఈ పర్యటనలో గూడూరు ఆర్డీఓ కిరణ్ కుమార్ , జిల్లా చేనేత జౌళి శాఖ ఆర్ డి రాజారావు, ఎ డి పిచ్చేశ్వర రావు, క్లస్టర్ డెవెలప్ మెంట్ అధికారులు శ్రీదేవి, మునిసిపల్ కమిషనర్ వెంకటరామయ్య, తహశీల్దార్ పద్మావతి , టాటా ట్రస్ట్ మస్తానయ్య, సురేష్, నేతన్నలు , మాస్టర్ వీవర్లు చింతగింజల సుబ్రహ్మణ్యం, స్థానికులు సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.

క్రైం న్యూస్

బస్సు బోల్తా

తృటిలో తప్పిన ప్రమాదం

రోడ్డుపక్క బోల్తా పడిన బస్సు

ప్రజాశక్తి- పెళ్లకూరు: ముందు వెళుతున్న వాహనాన్ని అధిగమించే ప్రయత్నంలో బస్సు అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో పలువురికి స్వల్పగాయాలవడంతో ప్రమాదం తప్పింది. ఈ సంఘటన పెళ్లకూరు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ కథనం మేరకు... పోలవరం గ్రామం ఒకే కుటుంబానికి చెందిన 23 మంది పెద్దవారు, నలుగురు పిల్లలతో తిరుమలకు మొక్కులు తీర్చుకునేందుకు వెళుతున్న క్రమంలోపెళ్లకూరు గ్రామం సమీపంలో ముందు వెళుతున్న బస్సును క్రాస్ చేసేందుకు ప్రయత్నించగా బస్సు అదుపుతప్పి రోడ్డు పక్క బోల్తా పడింది. బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు 12 మందికి స్వల్ప గాయాలు అయ్యాయి. ప్రయాణికులకు ప్రాణహాని తప్పింది. దీంతో ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం తెలుసుకున్న పెళ్లకూరు మండల ఎస్ఐ శ్రీకాంత్ సంఘటనా స్థలం చేరుకొని 108 సాయంతో క్షతగాత్రులను నాయుడుపేట గవర్నమెంట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. బస్సు డ్రైవర్ కర్రి శ్రీనివాసులు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్ట్

దుంగలు, కారు స్వాధీనం

టాస్క్ ఫోర్సు పోలీసుల అదుపులో ఎర్రచందనం స్మగ్లర్లు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కడప జిల్లా ప్రొద్దుటూరు పరిధిలో ఆరు ఎర్రచందనం దుంగలు, కారు స్వాధీనం చేసుకుని ఎనిమిది మంది స్మగ్లర్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. తిరుపతి టాస్క్ ఫోర్స్ డీఎస్పీలు మురళీధర్, చెంచుబాబు అధ్వర్యంలో ఆర్ఐ చిరంజీవులుకు చెందిన మురళీధర్ రెడ్డి టీమ్ సోమవారం పొద్దుటూరు, ఖాజీపేట సెక్షన్ లో కూంబింగ్ చేపట్టారని పత్తూరు ఫారెస్ట్ బీటు పరిధిలో పత్తూరు సమాధులు దగ్గర కొంతమంది వ్యక్తులు కారులోకి ఎర్రచందనం దుంగలు లోడ్ చేస్తూ కనిపించారన్నారు. వారిని చుట్టుముట్టి అక్కడ ఉన్న ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. స్మగ్లర్లను తమిళనాడు తిరువన్నామలై జిల్లా పోలూరు తాలూకాకు చెందిన శక్తివేల్ చిన్నస్వామి(33), రాజేంద్రన్(28), జమునామత్తూరు తాలూకాలోని భాస్కర్ (22), అజిత్ కుమార్ (25), ప్రవీణ్ కుమార్ (23), వేల్లియన్ (41), ఆనైకట్టు తాలూకా లోని రాజామణి ముత్తు(36), శేఖర్ చిన్నస్వామి (24)లుగా గుర్తించామన్నారు. వీరిని తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కు తీసుకొచ్చామన్నారు. వీరిని రిమాండుకు తరలించామని ఎస్ఐ రఫీ తెలిపారు.

ఆర్‌టిసి బస్సు ఢీ

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: పీలేరు తిరుపతి జాతీయ రహదారి, భాకరాపేట సమీపం నెమిలిగుండ్ల వద్ద తిరుపతి నుండి మదనపల్లి కి వెళుతున్న మదనపల్లి టు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సోమవారం రాత్రి రోడ్డును క్రాస్ చేస్తున్న సమయంలో ఓ వృద్ధుడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం సంఘటనపై భాకరాపేట ఇన్‌చార్జి ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు, బ్లూ, తెలుపు రంగు గళ్ల లుంగీ, మాసిన తెలుపు రంగు ఫుల్ షర్టు ధరించి ఉన్నాడు. ఇతని వద్ద మరే ఇతర ఆధారాలు లభించలేదు.

గుర్తు తెలియని యువకుడు మృతి

ప్రజాశక్తి - పిచ్చా టూరు: తిరుపతి జిల్లా పిచ్చాటూరు ఆరణియార్ రిజర్వాయర్ సమీపంలో గుర్తు తెలియని యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల సమాచా రంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, ఆ యువకుడి శరీరంపై రక్త గాయాలు ఉండటం చూసి అనుమా నాస్పద మృతిగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ యువకుడు ఎవరో, ఎక్కడ నుంచి వచ్చాడు? అనే విషయం తెలియరాలేదు. పిచ్చాటూరు తమిళనాడు ప్రాంతానికి సరిహద్దు ప్రాంతంగా ఉండటంతో ఎవరో అక్కడ నుండి వచ్చి ఇక్కడ హత్యాయత్నం చేశారా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఎవరైనా ఈ యువకుడిని గుర్తు పడితే సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరుతున్నారు.

ఘనంగా శ్రీకృష్ణ దేవరాయలు వర్ధంతి

శ్రీకృష్ణదేవరాయలుకు నివాళులు అర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కాపు సంక్షేమ సేన ఆధ్వర్యం లో పుత్తూరులో మంగళవారం శ్రీకృష్ణ దేవరాయలు 494వ వర్ధంతిని పురస్క రించు కొని రాయలవారి చిత్ర పటం ఏర్పాటు చేసి పూల మాలలు వేసి జ్యోతి వెలిగించి ఘనం గా నివాళులు అర్పించారు. బలిజ సంఘం నాయకులు, ఏపీ రాష్ట్ర కాపు సంక్షేమ సేన ఆర్గనైజర్ సెక్రెటరీ మాట్లాడుతూ భారతదేశంలో చక్రవర్తులలో ఎనలేని సేవలు చేసిన గొప్ప చరిత్ర కలిగిన నాయకుడు, తిరుమల వేంకటేశ్వర స్వామి కి వైడూర్యాలను కానుకలుగా సమర్పించిన భక్తుడిగా శ్రీకాళహస్తి లోగాలి గోపురాన్ని నిర్మించి, దేశంలో ఎన్నో చెరువులను తవ్వించిన గొప్ప రాజనీతి కలిగిన నాయకుడిగా శ్రీకృష్ణదేవరాయలు కీర్తి ప్రతిష్టలు పొందారన్నారు. ఈ కార్యక్రమాల్లో పుత్తూరు బలిజ సంఘం నాయకులు జి కృష్ణయ్య, టీ కేసవులు, పి రవికుమార్, ఆకుల గోపి, ఏపీ గోవిందస్వామి, ఎ దాము, రాయల్, ఈ మల్లికార్జున, సి గోపి, బాలు రాయల్ ముని కృష్ణయ్య, బలిజ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తిరుపతి(మంగళం): శ్రీకృష్ణదేవరాయల వర్ధంతి సందర్భంగా తిరుపతి నగరపాలక సంస్థ ప్రకాశం పార్క్ లో మంగళవారం ఆయన విగ్రహానికి జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్, వీర మహిళలు ఘన నివాళులు అర్పించారు. తెలుగు ఔన్నత్యాన్ని, సాహిత్యాన్ని బాహ్య ప్రపంచానికి తెలియజేసిన గొప్ప వ్యక్తి శ్రీకృష్ణదేవ రాయలని పసుపులేటి హరిప్రసాద్ కొనియాడారు. రాయలసీమను రతనాలసీమగా చెప్పుకునే విధంగా పాలన చేసిన ఘనత శ్రీకృష్ణదేవరాయలకు దక్కుతుందని, దేశభాషలందు తెలుగు లెస్స అని చాటిన గొప్ప వ్యక్తి అన్నారు. చెరువులు, నీటి కుంటల నిర్మాణాన్ని చేపట్టి రైతు బాంధవుడుగా శ్రీకృష్ణదేవరాయలు నిలిచారన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా గౌరవ అధ్యక్షులు కృష్ణయ్య, రాష్ట్ర కార్యదర్శి అకేపాటి సుభాషిణి, జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నా రాయల్, ఆనంద్, మనోహర్, ఈశ్వర్ రాయల్, లక్ష్మి, రాజమోహన్, కిరణ్ కుమార్, దిలీప్, కిరణ్ జన సైనికులు పాల్గొన్నారు.

తిరుపతి టౌన్ : రాయలపాలన మళ్లీ రావాలని ఆర్కాట్ కృష్ణప్రసాద్ అన్నారు. మంగళవారం తిరుపతిలో తిరుమల బైపాస్ రోడ్డులోని మునిసిపల్ పార్క్ లోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి రాష్ట్ర కాపు నాయకులు ఆర్కాట్ కష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కాపు నాయకులు ఆర్కాట్ కష్ణప్రసాద్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో తిరుమలతో సహా ఎన్నో ఆలయాలను నిర్మించిన ఘనత ఒక్క శ్రీకృష్ణ దేవరాయలకే దక్కిందని, అయన హయాంలో ప్రజలు సుభిక్షంగా ఉండేవారని, రత్నాలను రాసులుగా పోసి రోడ్డుపై అమ్మేవారని, మళ్లీ అలాంటి పాలన రావాలంటే కాపులు ముఖ్యమంత్రి గా రావాలని కోరారు. పొనగంటి భాస్కర్ మాట్లాడుతూ శ్రీకృష్ణ దేవరాయలు గొప్ప రాజు అని, అలాంటి రాజు తమ బలిజ కులంలో జన్మించడం గర్వకారణమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు డా.పి.ఎస్. కరుణానిధి, బెల్లంకొండ సురేష్ , గుట్టా నాగరాజారాయల్, ఈశ్వర్, రవిశంకర్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నీటి వనరులకు ప్రాధాన్యత

శ్రీ కృష్ణదేవరాయల పాలనలో విజయనగర సామ్రాజ్యంలో వ్యవసాయ అభివద్ధి గొప్పగా జరిగినట్టు చరిత్రకారుడు మైనా స్వామి చెప్పారు. శ్రీ సత్య సాయి జిల్లా గోరంట్ల విజయనగరంలో జరిగిన శ్రీకృష్ణదేవరాయల వర్ధంతి సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యంలో నీటి వనరుల అభివృద్ధికి రాయలవారు విశేషంగా కృషి చేశారన్నారు. రాజ్యంలో మొదటిసారి విజయనగర రాజ్య రాజధాని హంపి సమీపంలోని కొర్రకోడు వద్ద తుంగభద్ర నదిపై ఆనకట్టను నిర్మించిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు. రాష్ట్రంలో అతిపెద్ద చెరువు కంభం చెరువు ప్రకాశం జిల్లాలో ఉందని ఆ చెరువుతోపాటు తిరుపతి సమీపంలోని రాయల చెరువు వంటి పెద్ద చెరువులను ఎన్నింటినో క్రృష్ణదేవరాయలు కట్టించినట్టు మైనాస్వామి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో విశ్రాంత కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, ఉపాధ్యాయులు అనిమెల లక్ష్మీపతి, మనోహర్ నాయక్ పాల్గొన్నారు.

అందరికీ వైద్య సేవలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి -దొరవారిసత్రం : అనారోగ్యానికి గురైన ప్రతి వ్యక్తికీ వైద్య సేవలు అందించి బాగు చేయడమే ప్రభుత్వ లక్ష్యం అని దొరవారి సత్రం మెడికల్ ఆఫీసర్ చైతన్య అన్నారు. మండల పరిధిలోని తనియాలిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మంగళ వారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ రాష్ట్రంలో అందరినీ ఆరోగ్య వంతులు చేయాలని ధ్యేయంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేసిన ఈ పథకంలో అవసరమైన వైద్య సేవలు పొందాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 450 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఔషధాలు అందించారు. ప్రధానంగా బిపి 200 మంది సుగర్ రోగులు అధిక సంఖ్యలో పరీక్షలు చేయించుకున్నారు. దృష్టి లోపం ఉన్నవారు 80 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పోషక విలువలు కలిగిన పిండి వంటలను స్టాల్ లో ప్రదర్శిం చారు. ఈ వైద్య శిబిరంలో తని యాలి బూదూరు సర్పంచ్‌లు సుబ్బమ్మ, చంగయ్య, వైద్యాధికారులు చైతన్య, నిఖిత, పృథ్విని శ్రీనివాసులు ఆప్తమాలజిస్ట్ లలిత్ కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో రఘురామయ్య, అంగన్‌వాడీ సూపరు వైజరు అంకమ్మ, హెల్త్ సూపరువైజర్సు ఎంఎల్ హెచ్ పిలు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్, గ్రామ సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు , వాలంటీర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దొరవారి సత్రం మెడికల్ ఆఫీసర్ చైతన్య

కెవిబిపురం: జగనన్న ఆరోగ్య సురక్షను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. మంగళవారం మండలంలోని కాత్రపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్షకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లా డుతూ ప్రజ లందరికీ మెరుగైన వైద్యం అందాలన్న ఉద్దేశంతో ఈపథకం ప్రవేశపెట్టి వైద్య సేవలంది స్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవా లన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు పంపిణీతో పాటు శస్త్రచికిత్సలు అవసరమైన వారిని గుర్తించి వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ గవర్ల కృష్ణయ్య, ఎంపీపీ ముని లక్ష్మి, నందకుమార్ , ఏపీ మోడల్ స్కూల్ చైర్మన్ హరిబాబు, జడ్పిటిసి మూర్తి, మునియమ్మ, సర్పంచుల సంఘం అధ్యక్షులు రాము లాల్, బాబు యాదవ్, డేవిడ్, హరి, జగదీష్, నాగయ్య, పర్వతాల బాల సుబ్రహ్మణ్యం, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏర్పేడు: జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలని మడిబాక సర్పంచ్ కడివెళ్ల చెంగల్ రాజు కోరారు. మడిబాక గ్రామ పంచాయతీ సర్పంచ్ కడివెళ్ళ చెంగల్ రాజు చేతులు మీదుగా వైద్య శిబిరంలో వైద్య సేవలు పొందేందుకు మంగళవారం టోకెన్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం లక్ష్యం నెరవేర్చేందుకు వైద్య, ఆరోగ్య సిబ్బంది మడిబాక గ్రామ పంచాయతీ ఇంటింటికి వెళ్లి ప్రజలకు సేవాలంది స్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ పి హెచ్ దివ్యశ్రీ, ఏ ఎన్ ఎం జి లలిత, ఆశా వర్కర్ వెంకటమ్మ పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : ప్రభుత్వం ఆదేశాల మేరకు పేదలందరికీ ఉచిత మెరుగ్గైన వైద్యం అందించాలని. పుత్తూరు పురపాలక సంఘ చైర్మన్ ఏ హరి పేర్కొన్నారు. పట్టణంలో జగనన్న ఆరోగ్య సురక్ష యుపిహెచ్ సి అరెటమ్మ కాలనీ పరిధిలోని ఆర్‌టిసి కాలనీ వార్డు సచివాలయాలకు సంబంధించి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్ పర్సన్, మునిసిపల్ కమిషనరు కే ఎల్ ఎం రెడ్డి, వైస్ చైర్ పర్సన్లు, ఏ హరి, వైస్ చైర్మన్లు డి జయ ప్రకాష్, డి శంకర్ ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు ఒక వరమని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యూ పి హెచ్ సి అరెటమ్మ కాలనీ పరిధిలోని సచివాలయాల ప్రజలు అనేక మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. గైనకాలజిస్ట్, ఆర్థోపెడిక్స్, పీరియాట్రిక్ (చిన్న పిల్లల వైద్యులు), జనరల్, కళ్ల వైద్య పరీక్ష చేసి ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, వైద్య సిబ్బంది, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.